# పతంగం

ఆఫీసు నుంచి వచ్చి స్కూటరు లోపల పెడుతూ ఉండగా, మెట్లగది దగ్గరకు వచ్చి - "శ్రీధర్ వచ్చాడు" అంది జానకి.

"శ్రీధర్?"

"అవును! మీ తమ్ముడు శ్రీధర్".

ఆనందంతో కూడిన ఆశ్చర్యం, 'అవునా!' అన్న సంశయం ధ్వనించాయి నా ప్రశ్నలో.

"మధ్యాహ్నమే వచ్చాడు. రెండుసార్లు ఫోన్ చేశాం మీ కోసం. ఒకసారి గోడౌన్స్ కెళ్ళారనీ - మరోసారి ఇంకా తిరిగి రాలేదనీ చెప్పారు."

జానకి చెబుతున్న మాటలను చెవుల కొదిలేసి, హాలంతా శ్రీధర్ కోసం వెతుకుతున్నాయి కళ్ళు.

"నాని, శ్రీధర్ కలసి రైల్వే క్వార్టర్సు కెళ్ళారు మీ చెల్లాయి దగ్గరకు - ఈ పాటికి తిరిగి వస్తూ ఉండవచ్చు."

బట్టలు మార్చుకొని హాలులో సోఫాలో కూర్చున్నాను, జానకి ఇచ్చిన టీ తాగుతూ. మనస్సంతా ఉద్వేగంగా ఉంది, శ్రీధర్ వచ్చాడన్న వార్త పట్ల. శ్రీధర్‌ను చూచి ఎన్నాళ్ళయిందో! వాడు జర్మనీ వెళ్ళిపోయేముందు; పది సంవత్సరాలపైనే అయింది; బెంగుళూరు నుంచి వచ్చి బంధువులందరినీ చూసి వెళ్ళాడు. తరువాత నాలుగైదు సంవత్సరాలు ఉత్తరాల్లో కనిపించాడు. అదీ మా పది జాబులకు - ఓ

జవాబుగా.... ఆ తరువాత ఈ మధ్య అవీ లేవు. ఎంతో బిజీ అయిపోయాడు.

ఇంజనీరుగా వాడూ ఆ యంత్రాలలో ఒక యంత్రం అయిపోయాడా - అనిపించేది. ఆమధ్యోసారి డాక్టరేట్ చేసినట్లు - కొద్ది దినాలలో జర్మన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఫెలోషిప్పు పొందబోతున్నట్లు రాశాడు.

అదే చివరి జాబు వాడి నుంచి. మరి ఇక సమాచారమే లేదు. నేను రాసిన జాబులు తిరిగి వచ్చాయి - చిరునామా మార్పువల్ల.

మా ఇంట్లో ఏ ఫంక్షను జరిగినా, మరెలాంటి సందర్భంలో మా దగ్గరి బంధువులు కలుసుకొన్నా శ్రీధర్ తప్పక మా జ్ఞాపకాల్లోకి వచ్చేవాడు. శ్రీధర్‌ను తలచుకొన్నప్పుడల్లా కాలం ఆత్మీయులను ఎలా దూరం చేస్తుందో అనిపించేది.

హాల్లో లైటు వేసి - "ఈపాటికి రావలసిందే. మీ చెల్లాయితో కబుర్లలో మునిగిపోయి ఉంటారు" అంటూ, కిచెన్ కేసి వెళ్ళింది జానకి.

మళ్ళీ నా ఆలోచననిండా శ్రీధరే!

శ్రీధర్ మా బాబాయి కొడుకైనా మేమలా బ్రతకలేదు - చాలా మంది సన్ని హితులకు సైతం మేం స్వంత అన్నదమ్ములం కామని తెలియదు.

నా చిన్నతనంలోనే నాన్న పోయారు. నాకైతే నాన్న కొంచెంగా గుర్తే కాని, చెల్లాయి రుక్మిణికి ఆయన సరిగా తెలియదు. నాన్న పోయాక - బాబాయి మా కుటుంబ భారాన్ని నెత్తిన వేసుకొన్నాడు. పుసులూరులో ఉన్న మా పొలాల వ్యవసాయం తాను చూసుకొంటూ - చదువులకంటూ మమ్మల్ని విజయవాడలో పెట్టాడాయన.

అమ్మా, నేనూ, చెల్లాయీ, శ్రీధర్ విజయవాడలో ఉండేవాళ్ళం. వారం వారం తనొచ్చి మా అవసరాలను చూసి మా యోగ క్షేమాలను కనుక్కొంటూ ఉండేవారు బాబాయి.

అమ్మ మాటంటే ఆయనకు వేదవాక్కు. ఆయనంటే అమ్మకు - లక్ష్మణ సమానం. రుక్మిణి శ్రీధర్ కంటే చిన్నది. శ్రీధర్ నాకంటే రెండేళ్ళు చిన్న.

బాబాయి పర్యవేక్షణలో మా చదువులు సాగాయి.

ఆ సంవత్సరం రిజల్ట్సు వచ్చాయి. నేను బి.ఎస్సీ. పాసయ్యాను. శ్రీధర్

ఇంటర్ ర్యాంకులో పాసయ్యాడు. చెల్లాయి టెన్త్ కొచ్చింది. మా పరీక్షల విషయం తెలిసి విజయవాడ వచ్చిన బాబాయి నాతో - "పై చదువుల విషయం నాకేం తెలుసు? మీరేం చదవాలో నిర్ణయించుకొని చెపితే నా వంతుగా కావలసిన డబ్బు సమకూర్చుతా" అన్నాడు.

బాబాయి పొలంలో దమ్ము చేయిస్తూ అటు నుంచి అటే వచ్చాడట. బట్టలన్నీ మట్టి కొట్టుకొని ఉన్నాయి. మనిషెంతో అలసిపోయి కనిపించాడు.

పుసులూరులో - నీరు సరిగా అందని ఆ పొలాల గట్ల మీద రాత్రింబవళ్ళు తన జీవితాన్ని మా కోసం వెలపోస్తున్న అరవై సంవత్సరాల బాబాయిని చూశాక - ఇక ఆయనకి విశ్రాంతి ఇవ్వాలి అనే నిర్ణయాని కొచ్చాను.

"నేను ఏదైనా ఉద్యోగంలో చేరతాను. శ్రీధర్‌కు మంచి భవిష్యత్తుంది. వాడు ఇంజనీరింగ్‌లో చేరతాడు. ఆ పొలాలను కౌలు కిచ్చి మీరూ మాతో పాటు ఇక్కడే ఉండండి" అన్నాను.

"అదేమిటిరా నాయనా? నీ వప్పుడే చదువు మానివేయడం దేనికి? వద్దు" అన్నాడు బాబాయి.

"ఈ కుటుంబాన్ని మోయడానికి ఇంతవరకు నీ వెంత శ్రమించావో నాకు తెలుసు. నీ కిక విశ్రాంతి నివ్వాల్సిన బాధ్యత ఈ కుటుంబానికి పెద్ద కొడుకుగా నాది."

"నా కిప్పుడేమైందని? పరవాలేదు. మరి కొద్ది సంవత్సరాలేగా? నాకేం శ్రమ కాదు. నీవు మాత్రం చదువు కొనసాగించు."

బాబాయి ఎంత చెప్పినా నేను వినలేదు. స్థిరంగా నా నిర్ణయం చెప్పాను. నా చదువు ఆపేయడం పట్ల ఆయనెంతో బాధపడ్డాడు. కాదూ, కూడదూ అంటూ నన్ను వారింపచేశాడు తన శాయశక్తులా.

"పోనీలే కృష్ణమూర్తీ! వాడు చెప్పినట్లే చేయటం మంచిదేమో!" అంది అమ్మ.

"అదికాదు వదినా!" అంటూ ఏదో చెప్పబోయిన బాబాయితో - "శ్రీధర్ ఇంజనీరింగ్- రుక్మిణి పెళ్ళి.. ఈ రెండు భారాలు ఎలాగూ ఉన్నాయి మనకు.

వాడన్నట్లు ఈ బరువు బాధ్యతల్ని వాణ్ణి కొంత మోయనివ్వు" అంది అమ్మ.

బాబాయి తన అభీష్టానికి వ్యతిరేకంగా ఊరకుండిపోయాడు.

విజయవాడలోనే కొత్తగా పెట్టిన ఫార్మాస్యూటికల్స్‌లో అప్రెంటిస్ కెమిస్టుగా చేరాను. శ్రీధర్‌కు ఇంజనీరింగ్ సీటు వచ్చింది. కాకినాడ వెళ్ళాడు.

"రుక్మిణిని ఒక అయ్య చేతిలో పెట్టేంతవరకు పొలాలను కౌలు కిచ్చేది లే" దంటూ బాబాయి మాత్రం పుసులూరు నుంచి రాలేదు. సంవత్సరం తిరిగేసరికి నన్ను 'కెమిస్టు'గా వేసుకున్నారు మెడికల్ కంపెనీవారు. మంచి జీతంతో పాటు, క్వార్టర్సు ఇచ్చారు. జీవితం సాఫీగా సాగిపోతున్నట్లనిపించసాగింది.

ఓనాడు ఆఫీసు నుంచి వచ్చేసరికి బంధువులున్నారింట్లో.

"గుర్తుందా! మీ వర్ధనమ్మ అత్తయ్య" అంది అమ్మ.

నాన్నకు పినతల్లి కూతురు వర్ధనమ్మత్త. నా చిన్ననాట చూసిన గుర్తు. ఉద్యోగ రీత్యా వాళ్ళు దూరంగా ఉండటంతో ఈ మధ్య రాకపోకలు లేవు.

"వాళ్ళ అమ్మాయి జ్యోతి" - చూపింది అమ్మ, అప్పటికే రుక్మిణితో కబుర్లలో ఉన్న అమ్మాయిని.

నల్లని కురులు, గులాబి చాయలో తనువు, కాటుక కళ్ళు, తెల్లని పలువరుస - వెలిగించిన జ్యోతిలానే ఉంది.

"జ్యోతి! వీడే మా-" అని నన్ను పరిచయం చేయబోతున్న అమ్మ మాటలను మధ్యలో అందుకొని - "భాస్కరం బావ, ది గ్రేట్ కెమిస్టు" అంది వయ్యారంగా నవ్వుతూ.

జ్యోతి నవ్వులో మళ్ళీ మళ్ళీ వినాలపిపించేదేదో ఉంది.

జ్యోతి వాళ్ళ నాన్న చలపతి మామయ్య బదిలీ మీద విజయవాడ మిల్క్ చిల్లింగ్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టరుగా వచ్చాడు.

రెండు రోజులు మాతో ఉన్నాక ఖాళీ అయిన వాళ్ళ బంగళాకు వెళ్ళిపోయారు వాళ్ళు. రుక్మిణి, జ్యోతి ఒకే కాలేజీ. జ్యోతి తరుచూ రుక్మిణి కోసం వచ్చేది మా ఇంటికి. చలాకీగా ఉండేది. రుక్మిణిపైన, నాపైన జోక్సు వేసేది.

"వాళ్ళనలా ఉడికిస్తావేమే?" అని అమ్మ అంటే - "మేనత్త కూతురి

కామాత్రం అధికారం ఉంటుందిలే అత్తయ్యా!" అనేది.

జ్యోతి పట్ల ముభావంగా మొదలైన నా వైఖరి క్రమంగా మారుతూ వచ్చింది.

లాబ్ లో కూర్చొని సీరియస్‌గా పని చేసుకొనే సమయాలలో జ్యోతి పేల్చిన ఏ జోకో జ్ఞాపకాని కొచ్చి నవ్వొచ్చేది. చిన్న చిన్నగా అలముకొంటున్న ప్రాత:కాలపు పొగమంచులా నా ఊహలను జ్యోతే ఆక్రమించటం ప్రారంభించింది. జ్యోతి నవ్వుతూ నా ప్రక్కన నిలిచినట్లు - తుళ్ళుతూ నా కనులలోకి చూస్తున్నట్లు - అనిపించేది.

ఓసారి గాంధీ హిల్‌కి వెళ్ళి తిరిగి వస్తూ ఉండగా - "జ్యోతీ! మనం ఇలాగే ఒకరి పక్కన ఒకరం జీవితాంతం నడవగల్గితే?" అన్నాను.

నాకేసి నిశితంగా చూపు నిలిపి - "ఏమిటీ? బావగారికి బరువైన డైలాగులు వచ్చున్నమాట" అంది.

అంతలో మాకు దూరంగా నడుస్తున్న రుక్మిణి రావటంతో మా మాటలు ఆగిపోయాయి.

మూడు రోజుల తరువాత వచ్చింది జ్యోతి - నేను నా గదిలో కూర్చొని ఏవో ఆఫీసు కాగితాలు చూసుకుంటూ ఉండగా - "అవును బాస్! జీవితాంతం ఒకరి పక్కన ఒకరం నడవటం బాగానే ఉంటుందనిపిస్తోంది" అంది.

నాకు పట్టలేని ఆనందం వేసింది. అలా జ్యోతిని నిలువెల్లా చూస్తూ ఉండి పోయాను.

"ఇంత మంచి వరం ప్రసాదిస్తే, అలా చూస్తూ ఉండిపోతారా?"

"ఏం చేయాలంటావు?" అన్నాను అయోమయంగా.

జ్యోతి దగ్గరగా వచ్చి - "మొద్దబ్బాయ్!" అంటూ నెత్తి మీద ఓ మొట్టికాయ వేసి కొంటెగా వెక్కిరించి వెళ్ళిపోయింది.

జ్యోతి వెళ్ళాక స్ఫురించింది - మొద్దబ్బాయినే అని.

ఆనాటి నుంచి నాకూ, జ్యోతికీ దుర్గ గుడి దర్శనాలు, షికార్లు, ఏకాంతాలు, జనాంతికాలు ఎక్కువయ్యాయి.

బాబాయి వచ్చాడో రోజు. రుక్మిణికి పెళ్ళి సంబంధాలు చూడమని అమ్మ చెప్పింది బాబాయితో.

"నాయనా భాస్కరం..... ఆ విషయం మాట్లాడాలనే వచ్చాను. నాకేం తెలుస్తాయి? మన మధ్య ఒక్క ఆడపిల్ల అది. మంచి ఉద్యోగపు స్థాయిలో ఉన్న సంబంధం చూడు" అన్నాడు బాబాయి.

అమ్మా, బాబాయీ హెచ్చరించేవరకూ నాకు ఆ ఆలోచన రానందుకూ, ఎదిగిన చెల్లిని ఇంట్లో పెట్టుకొని నా జీవిత భాగస్వామిని వెతుక్కోవటంలో పడి పోయినందుకూ రవ్వంత కించపడ్డాను నాకు నేనే.

తక్షణం రుక్మిణికి సంబంధాలు వెతకటంలో మునిగిపోయాను.

చలపతి మామయ్యకు రీజినల్ ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చి కాకినాడ వెళ్ళి పోయాడు. కాకినాడ వెళ్ళిపోయే ముందు - రైలు స్టేషనులో ఎలాగో ఏకాంతాన్ని సృష్టించుకొని - "రుక్మిణి పెళ్ళి అయ్యాక, మన విషయం మామయ్య, అత్తయ్యలతో మాట్లాడదాం" అన్నాను జ్యోతితో.

"తొందరేముంది? రుక్మిణి పిల్లలు పుట్టేంతవరకు ఆలోచిస్తూ ఉందాం?" అంది జ్యోతి వెటకారంగా.

జ్యోతి చిరాకుగా ఉందనిపించింది. జ్యోతి చిరాకునూ అర్థం చేసుకోగలిగాను.

ఆ క్షణం నుంచి రుక్మిణి పెళ్ళి సంబంధాల వేట ముమ్మరం చేశాను. రుక్మిణి పెళ్ళి పుసులూరులోనే జరిపాము. శ్రీధర్ పది రోజుల ముందే వచ్చి పెళ్ళి పనులలో ఆసరాగా ఉండిపోయాడు మాకు.

పెళ్ళినాటికి అత్తయ్య - జ్యోతి వచ్చారు. "బరువు బాధ్యతలు తీరాయిగా? ఇకనైనా ఆ తాతల నాటి సైకిలు బండి వదిలేసి - ఓ స్కూటరు కొనుక్కో బావా!" అంది జ్యోతి.

"తప్పకుండా! అమ్మాయిగారు మా ఇంట చేరాక" అన్నాను జ్యోతికి చెవిలో చెప్పినట్లు.

"అంటే.... మరో అర్ధ శతాబ్దికా? ఆ పాటికి స్కూటర్లు అవుటాఫ్ ఫాషన్ అయి, వాటి ప్రొడక్షన్లు ఆపేస్తారు."

"అదేం లేదు - మరో...."

"ఊహల్లో జీవించే వాళ్ళంటే నాకు చెడ్డ చిరాకు బావా! ఐ లైక్ పీపుల్ విత్ డాష్.. బట్ నాట్.... ఆ, ఎందుకులే" అంటూ ఆపివేసింది జ్యోతి.

తిరిగి వెళ్ళేటప్పుడు అత్తయ్య, జ్యోతి , శ్రీధర్ కలిసి వెళ్ళారు కాకినాడ.

"ఇదిగో వదినా! శ్రీధర్‌కు హాస్టలు కూడు భొత్తిగా పడుతున్నట్లు లేదు. ఈ మూడు నెలలు పెద్ద పరీక్షలు కూడా. పోనీ వచ్చి మాతో ఉండరా అంటే ఎంత మొహమాటమో?" అని అంది వర్ధనమ్మత్త అమ్మతో, తిరిగి వెళ్ళేనాడు.

నిజమే నపిపించింది మా అందరికీ. శ్రీధర్‌ను అందరం వత్తిడి చేశాము. ఈ ఆరు నెలలూ అత్తయ్య వాళ్లింట్లో ఉండమని. ఎలాగైతేనేం ఒప్పించి పంపాము.

జ్యోతి అభీష్టం మేరకు స్కూటరు కొనుక్కున్నాను. ఇన్‌స్టాల్ మెంట్స్ జీతంలో రాబట్టుకొనే పద్ధతిపైన కంపెనీ వారే కొని పెట్టారు.

స్కూటరు తీసుకొని మొదటి రోజు - దానిమీద ఇంటికి వస్తున్నప్పుడు - నా వెనకాల జ్యోతి కూర్చునట్లే ఫీలయ్యాను.

శ్రీధర్ రిజల్ట్సు వచ్చాయి. స్టేట్ ఫస్ట్ వచ్చాడు. అభినందించాను.

"ఈ అభినందనలు నా కంటే జ్యోతికే ఎక్కువ చెందుతాయి. నా కీ స్టేట్ ఫస్ట్ రావటానికి నా వెనక ఉండి ఎంత ఎంకరేజ్ చేసిందో!" అన్నాడు.

శ్రీధర్ ఇకపైన ఏం చేయాలి - అనే విషయం చర్చకు వచ్చింది. ఎం. టెక్. చేయమన్నాను.

"వాడూ ఏదైనా ఉద్యోగం చేసుకుంటే బాగుంటుందేమో!" అన్నాడు బాబాయి.

బాబాయి అలా అనటానికి కారణం నాకు తెలుసు. నాలుగు సంవత్సరాలుగా పుసులూరులో పంటలు పోతూ వచ్చాయి. పైగా రుక్మిణి పెళ్ళికి - "ఒక్కగా నొక్క బిడ్డ. దాన్ని ఏ దిక్కులేని కొంపకో పంపలేను" అంటూ ఘనమైన సంబంధం తేవటానికి తలకు మించిన అప్పులు చేశారాయన.

"బాబాయ్! ఇకపైన వాడి బాధ్యత నాది. వాడెంతవరకూ చదువుకుంటే అంతవరకూ చదవాల్సిందే!" అన్నాను.

"అవును. ఎం. టెక్. చేద్దామనే అనుకొంటున్నాను. జ్యోతి కూడా మద్రాస్ గిండీలో చేరమంటోంది. చలపతి మామయ్య మద్రాస్ గవర్నమెంటు వారి డైరి డెవలప్ మెంటు ఫెడరేషన్‌కు డెపుటేషన్ మీద వెళుతున్నారు" - అన్నాడు శ్రీధర్.

శ్రీధర్ మీద జ్యోతి ఇన్‌ఫ్లుయెన్స్ ఎక్కువగానే ఉందనిపించింది.

మద్రాస్ గిండీలో చేరాడు శ్రీధర్. వాడలా చేరడానికి నేనుగా చాలా ఆదుకోవాల్సి వచ్చింది. పర్యవసానంగా - మా విషయం పెద్దలతో ప్రస్తావించటం కొంతకాలం వాయిదా వేసుకోవలసి వచ్చింది.

జ్యోతికి ఆ విషయమే రాశాను. జ్యోతి నుంచి నాకు తిరుగు జాబు లేదు.

జ్యోతికి కోపం వస్తుందని నేనూహించిందే. పుసులూరు నుంచి బాబాయి "వర్ధనమ్మత్త రాసిం"దంటూ జాబు తీసుకువచ్చారు.

"ఇకపైన శ్రీధర్ చదువు బాధ్యతలు తమవే"నంటూ రాసింది అత్తయ్య.

"వాళ్ళ అమ్మాయిని శ్రీధర్ కివ్వాలనే అభిప్రాయం ఉన్నట్లుంది వాళ్ళకి" అనే అనుమానాన్ని వెలిబుచ్చారు బాబాయి.

నా అంతరంగంలో ఎక్కడో ఏదో 'దబ్' మన్న శబ్దం అయినట్లనిపించింది.

"వాళ్ళకూ ఒక్కగా నొక్క బిడ్డ. ఎంతో కలిమీ బలిమీ గల కుటుంబం. వాళ్ళ కా ఆలోచన ఉండాలే కాని, శ్రీధర్ అదృష్టవంతుడు కదూ!" అంది అమ్మ.

నే నెక్కిన స్కూటరుకు సైలెన్సరు పోయినట్లు చిరాకెత్తించే ధ్వని తరంగాలు నా చుట్టూ మూగాయి. ఆ అదృష్టవంతుడు శ్రీధరా?

"అవును బాస్! జీవితాంతం ఒకరి పక్కన ఒకరం నడవగలిగితే బాగానే ఉంటుంది" అన్న జ్యోతి.

"మొద్దబ్బాయ్" అంటూ నెత్తిన మొట్టిన జ్యోతి.

"ఆ తాతల నాటి సైకిలు బండిని వదిలేసి - ఓ స్కూటరు కొనుక్కో బావా!" అన్న జ్యోతి కనుల ముందు మెసలటంతో - వర్ధనమ్మ అత్తయ్య జాబుకు ప్రత్యేకమైన అర్థం లేదేమోలే - అని మనసుని నివారించుకోగలిగాను.

వెంటనే జ్యోతిని చూడాలనిపించింది.

"ఓసారి మద్రాసు వెళ్ళి వస్తాను." అని బయలుదేరాను.

అత్తయ్య జాబులో అంతరార్థాన్ని కనుక్కోవటానికి నేను మదరాసు బయలు దేరానని అమ్మా, బాబాయీ భావించారు.

కాని, నా అంతరంగంలోని ఆశ, ఆలోచన మరొకటి. నే నెక్కిన స్కూటరు వెనుక జ్యోతి పదిలంగా కూర్చుని ఉందో, లేదో చూసుకోవటం.

మద్రాసు జి.టి. ఆ రోజు ఆలస్యంగా చేరింది. నే వెళ్ళేపాటికి అత్తయ్య, మామయ్య మాత్రమే ఉన్నారింట్లో.

"శ్రీధర్ - జ్యోతి అలా షాపింగేదో ఉందిట, చేసుకొని బీచి వరకు వెళ్ళి వస్తామని వెళ్ళారింతకు ముందే." చెప్పింది అత్తయ్య.

బీచిలోని అలలు రేపుతోన్న ధ్వని నా చెవిని సోకుతున్నట్లే అనిపించింది.

మేం భోజనాలు చేసేపాటికి చాలా ప్రొద్దుపోయింది.

"వాళ్ళంతే! సెలవు వస్తే అలా బీచీ, ఆ పైన ఏ హోటల్లోనో డిన్నరు చేసి, సెకెండు షోలకు తిరిగి లేటుగా వస్తారు" అంది అత్తయ్య.

చలపతి మామయ్య మాత్రం - ప్రపంచంలో డెన్మార్కు తరువాత అంతటి ఆధునాతన పద్ధతులపై 'డైరీయింగు'ను డెవలప్ చేస్తున్న దేశాలేవో - వాటిలో మన భారతదేశం ఎక్కడ ఉందో ఏకరువు పెడుతున్నాడు.

నా మనసు పరాకుగా ఉంది.

"ప్రయాణం చేసి వాడసలే అలసిపోయాడులా ఉంది. రేపు మాట్లాడుకోవచ్చు లెండి" అంటూ అత్తయ్య మేడపైనపని పిల్ల చేత పక్క వేయించి, "వాళ్ళే అర్ధరాత్రికి వస్తారో! నీవు పడుకో" అంది.

"అర్ధరాత్రి సిటీ బస్సులుంటాయా?"

"స్కూటరు తీసుకుని వెళ్ళినట్లుంది. మరిచాను - శ్రీధర్ స్కూటరు కొనుక్కొన్నాడు" అంది అత్తయ్య కిందకు వెళుతూ.

శ్రీధర్ స్కూటరు కొన్నాడా?

ఆకాశం మేఘావృతమైంది. ఫెళ ఫెళ మంటూ ఉరుములు వినిపించాయి బయట. కలతగా నిద్ర పట్టింది.

నేనూ, శ్రీధర్ ఒకే స్కూటరుపైన ప్రయాణం చేయటానికి ప్రయత్నం

చేస్తున్నట్లు - ఏవేవో దృశ్యాలు.

ఆ మరునాటి సాయంత్రం శ్రీధర్ నన్ను తన స్కూటరుపైన ఎక్కించుకొని శాంథోమ్‌కు తీసుకు వెళ్ళాడు.

నీటి అలలు మా పాదాలను తాకుతున్నంత దగ్గరగా ఆ బీచీలో నడచు కొంటూ చాలా దూరం వెళ్ళాము. మా మధ్య నిశ్శబ్దం!

పెద్ద అల ఒకటి వచ్చి - మా కాళ్ళ దగ్గరగా పగిలిపోయింది.

"జ్యోతిని చేసుకొందా మనుకొంటున్నాను" అన్నాడు శ్రీధర్, సడెన్‌గా మా మధ్య ఉన్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

తలెత్తి వాడికేసి చూశాను. వాడు తలదించుకున్నాడు.

అలాంటి ప్రస్తావనకు ఆ పాటికే నేను మానసికంగా సిద్ధంగా ఉన్నాను. పొద్దున బ్రేక్‌ఫాస్ట్ టేబులు దగ్గర అత్తయ్య ఈ విషయాన్ని - మామయ్య సమక్షంలో ప్రస్తావించి ఉండటాన.

"మరి జ్యోతి అభిప్రాయం తెలుసుకొన్నావా?" ప్రశ్నించాను శ్రీధర్‌ను.

"ఈ ప్రపోజలు మొదట జ్యోతి నుంచే వచ్చింది" తల దించుకొనే సమాధానం చెప్పాడు.

చిన్నగా నవ్వాను.

"ఎందుకలా.... పాతకాలపు ఆడపిల్లలా తల వంచుకుంటావు?"

"నాన్నకూ - నాన్న తరువాత అంతటి నీకూ ఎలాంటి ప్రమేయం లేకుండా ఈ నిర్ణయం తీసుకొన్నందుకు."

"ఫరవాలేదు. ఒక రకంగా ఇలాంటి నిర్ణయాల్లో మరొకరి ప్రమేయం ఉండకూడదు కూడా" అన్నాను.

తిరిగి వచ్చేశా మింటికి.

మూడవనాడు విజయవాడ బయలుదేరేవరకు - నేను జాగ్రత్త వహించింది ఒకే ఒకందుకు, జ్యోతి కళ్ళలోకి పొరపాటున కూడా సూటిగా చూడకుండా ఉండ గలందులకు.

ఆ క్షణం నుంచి జ్యోతి నాకు రుక్మిణిలా తోచింది. గతంలో జ్యోతి నాకు

తటస్థపడిన ఆనవాళ్ళే లేవు, నాలోని ఏ అణువులోనూ. మద్రాసు నుంచి తిరిగి ప్రయాణమైన నా మనస్సెంతో ప్రశాంతమైంది.

నేను తిరిగి వచ్చేవరకూ విజయవాడలోనే ఉన్నారు బాబాయి.

జ్యోతిని శ్రీధర్‌కు ఇవ్వాలని అత్తయ్య వాళ్ళ అభిప్రాయమనీ, త్వరలో పెళ్ళి కూడా జరపాలనేది వాళ్ళ అభిమతమనీ చెప్పాను.

"శుభం!" అంది అమ్మ.

బాబాయి ఏమీ మాట్లాడలేదు.

"మనం అడగాల్సిన దేమీలేదు. ఇక వాళ్ళెప్పుడు సిద్ధమంటే మనమూ సిద్ధమే - అలా వాళ్ళకు రాసి పడేయ్" అంది అమ్మ బాబాయితో.

"అదెలా - వదినా? పెద్దవాడు భాస్కరం పెళ్ళయ్యాకే శ్రీధర్ పెళ్ళి."

"దాందేముంది! ఎవరికి ముందు కుదిరితే వాళ్ళది. కళ్యాణ ఘడియలు వచ్చాక ఆగుతాయా?"

"నీ మాట కాదంటున్నందుకు ఏమీ అనుకోకు వదినా! భాస్కరానికి పెళ్ళి అవ్వందే..... శ్రీధర్ పెళ్ళి ప్రసక్తి లేదు."

"ఆ, పోనీ.... అలాగే" - బాబాయి మాటకి తల ఒగ్గింది అమ్మ.

ఆ సాయంత్రం స్కూటరు మీద బాబాయిని ఎక్కించుకొని బస్సు దగ్గరకు తీసుకొని వెళ్ళాను. పుసులూరు వెళ్ళేందుకు బస్సెక్కపోతూ- "ఏరా భాస్కరం! ఆ జ్యోతి కుదురైన మనసుగల పిల్లేనా? శ్రీధర్ తొందరపడలేదు కదా?" అన్నారు బాబాయి.

"వాళ్ళిద్దరూ ఒకరి నొకరు కావాలనుకుంటున్నారు. వాళ్ళేం చిన్న పిల్లలు కాదు. మామయ్యా, అత్తయ్యా ఇష్టపడ్డారు. వాళ్ళ ఆధారముంటే శ్రీధర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇంతకంటే మనం ఆలోచించాల్సినదేముంటుంది?" అన్నాను.

నా సమాధానంలో - 'కుదురైన, మనసున్న పిల్లేనా జ్యోతి' - అన్న ఆయన ప్రశ్నకు సమాధానం దొరికినట్లు లేదు బాబాయికి.

ఒక్క క్షణం అదోలా చూసి - "మీ ఇష్టం నాయనా!" అని నిట్టూర్చి బస్సెక్కాడాయన.

బస్సెక్కిన బాబాయి పుసులూరు చేరలేదు. బస్సులో గుండె నొప్పి రాగా, భగవత్సాన్నిధ్యం చేరారు.

అతి విచిత్రంగా నెల తిరక్కముందే - 'ఆయన్ను వదిలి ఎన్నడూ నే నొంటిగా ఉండి ఎరుగను' - అన్నట్లు పిన్నీ పోయింది.

ఆ రెండు మరణాలతో అమ్మా క్రుంగిపోయింది. "ఎందుకో నే నొక్కదాన్నీ మిగిలిపోయాను" అని బాధపడేది.

"ఎవరి ఘడియలు వారివి. నా ఘడియ వచ్చేపాటికి నీవో ఇంటి వాడివి కావాలి" అంటూ అమ్మ పట్టిన పట్టు మూలంగా - ఆరు నెలల్లో జానకి నా అర్థాంగిగా మా ఇంట కాలు పెట్టింది.

బాబాయి ఏటి సూతకం పోగానే శ్రీధర్ - జ్యోతుల వివాహం జరిపించాము. నేనూ, జానకీ పీటల మీద కూర్చొని.

బెంగుళూరు ఏరోనాటిక్స్‌లో ఇంజనీరుగా వెళ్ళాడు శ్రీధర్. అక్కడ చాలా గొప్ప పేరు, ప్రఖ్యాతి గడించాడు. టెక్నాలజీలో వాడి ప్రజ్ఞాపాటవాలు, విజయాలు వాడికి ప్రెసిడెంట్ మెడల్ తెచ్చి పెట్టాయి.

బెంగుళూరులో కట్టుకొన్న బంగళా గృహప్రవేశానికి రమ్మని ఆహ్వానం వచ్చింది శ్రీధర్ నుండి. పనుల వత్తిడివల్ల వెళ్ళలేకపోయాను. అమ్మనూ, జానకినీ పంపాను.

తిరిగి వచ్చాక -"మీరు రాలేదని మీ తమ్ముడు కళ్ళ నీళ్ళపర్యంతం అయ్యాడు" అంది జానకి మళ్ళీ జానకే నేన్ను వేయని ప్రశ్నకు సమాధానం చెపుతున్నట్లు - "రావటానికి బావగారికి వీలుపడలేదా? అంది మీ జ్యోతి"- అని కూడా చెప్పింది.

"ఇల్లెలా ఉంది?" అన్నాను.

"ఎలా ఉంటుంది - భూతల స్వర్గంలా ఉంది."

"అంత బాగా కట్టాడా?"

"బాగా కట్టాడా అనకండి. కట్టించిందా అనండి. అంతా జ్యోతి ప్లానింగ్. జ్యోతిది గొప్ప టేస్ట్ - మీ శ్రీధర్ కట్టించి ఉంటే - పుసులూరిలోని మీ మండువా

ఇల్లు తిరిగకట్టించి ఉండేవాడు."

"నీ మొహం! వాడో గొప్ప ఇంజనీరని మరిచిపోకు."

"అవును. శ్రీధర్ గొప్ప ఇంజనీరే కాదనటం లేదు - కాని జ్యోతి గొప్ప ఆర్కిటెక్టు అండ్ అడ్మినిస్ట్రేటరు. మీరే మరిచిపోయారనుకుంటా" అంది జానకి.

మరిది మీద జోకులు వేయటం అలవాటే జానకికి. కాని గృహప్రవేశం నుంచి తిరిగి వచ్చిన అమ్మ మోము చూశాక జానకి మాటల వెనకాల ఏదో ఉందనిపించింది.

అమ్మ బాధపడుతున్న మనసుతో మౌనంగా ఉంది. "అలా ఉన్నావేం?" అని గుచ్చి గుచ్చి ప్రశ్నించగా - "శ్రీధర్‌ని అనాలోచితంగా మనం 'బంగారు లేడి' వెంట పరుగెత్తించామేమోరా!" అంది దిగులుగా.

ఆ ఇంటికి మా బాబాయికి గుర్తుగా 'శ్రీకృష్ణ నిలయం' అని పేరు పెట్టాలన్నది శ్రీధర్ అభిమతం కాగా - "అలాంటి సెంటిమెంట్స్ నాకు గిట్టవు" అంటూ జ్యోతి 'ఎవర్ గ్రీన్ విల్లా' అని పేరు పెట్టిందట.

ఆ తరువాత కూడా ఒకటి రెండు సంవత్సరాలు వాళ్ళను చూడటం పడలేదు నాకు. వాడే బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా మమ్మల్నందరిని చూడటానికి వచ్చి ఓ వారం రోజులపాటున్నాడు మాతో. "వెస్టు జర్మనీ నుంచి కన్సల్‌టేటివ్ ఇంజనీరుగా రమ్మని ఆఫర్ వచ్చింది. నాకైతే పెద్దగా ఆసక్తి లేదు. కాని జ్యోతి వెళదామంటోంది" అన్నాడు.

"సంపాదనకు అంతేముంది నాయనా? అదొక అంతంలేని పరుగు. జీవితంలో సాధించుకోవాల్సింది తృప్తిని. నీ వెక్కడికీ వెళ్ళవద్దు. మా కళ్ళ ముందే ఉండు" అంది అమ్మ.

శ్రీధర్ సమాధానం చెప్పలేదు. అమ్మ మాటలు విని ఊరకుండిపోయాడు. చిన్ననాటి నుండి వాడి స్వభావం అంతే... పెద్దగా ఏమీ మాట్లాడడు.

విజయవాడ నుంచి విశాఖ వెళ్ళి అక్కడున్న రుక్మిణిని చూసి తిరిగి వెళ్ళి పోయాడు బెంగుళూరు. ఆ తరువాత జర్మనీ వెళ్ళారు శ్రీధర్, జ్యోతి.

ఇన్ని సంవత్సరాలకు మళ్ళీ తిరిగి వచ్చాడు - "ఏమిటి కూర్చునే నిద్ర

పోతున్నారా?" వంట పూర్తి చేసుకుని హాల్లోకి వస్తూ ప్రశ్నించింది జానకి.

ఆలోచనల నుంచి మేల్కొన్నాను.

నా కెదురుగా కూర్చుంటూ - "ఈ పాటికి రావలసిందే. మీ చెల్లాయి రానిచ్చి ఉండదు" అని జానకి అంటుండగానే వచ్చారు రుక్మిణి, నాని, శ్రీధర్.

వచ్చి ఎదురుగా నిల్చున్న శ్రీధర్‌ని చూస్తూనే అవాక్కయినట్లు అలా చూస్తుండి పోయాను. నా కంటే పది సంవత్సరాలు వయసు పై పడ్డవాడిలా పండిపోయి, రాలి పలచబడిన జుత్తు, ఆ కళ్ళజోడు. వెనకాల ఎక్కడో లోతుగా పీక్కుపోయిన కళ్ళు. వీడేనా మా శ్రీధర్ అనిపించింది.

పిన్ని తన ఆఖరి క్షణాల్లో నా చేతిని తన చేతిలోకి తీసుకొంటూ - "నాయనా భాస్కరం! శ్రీధరాన్ని కనిపెట్టి ఉండు" అన్న మాటలెందుకో గబుక్కున మదిలో మెదిలాయి.

నిండిన అశ్రువులతో నా కళ్ళు మసక మసగ్గా అయిపోయాయి.

"అన్నయ్యా!" అంటూ వచ్చి సోఫాపై నున్న నన్ను పెనవేసుకొన్నట్లు అనుకొని కూర్చుండిపోయాడు శ్రీధర్. వాడి కంఠమూ గద్గదమైంది.

"ఆడవాళ్ళకంటే అన్యాయంగా ఉందే అన్నదమ్ముల పరిస్థితి!" అంది జానకి వేళాకోళంగా.

"అవునులే వదినా! రెండు నెలల కొకసారి 'మా అన్నయ్య, మా అమ్మ...' అంటూ బెంగెట్టుకొని పుట్టింటికి పరుగెత్తే నువ్వే వెక్కిరించాలి మమ్మల్ని" - రుక్మిణి జానకిపైకి విసిరిందో వెటకారాన్ని.

"మరిచిపోయాను తల్లీ! నీవూ ఉన్నావుగా - పార్టీ పెద్దదైంది. ఇక మాట్లాడను."

మరి కొంచెంసేపటికిగాని నేను, శ్రీధర్ మామూలు మనుషులం కాలేక పోయాము. ఆపైన చిన్నగా కబుర్లలో పడిపోయాము.

పక్క గదిలోనుంచి రుక్మిణి, జానకిల మాటలు వినిపిస్తున్నాయ్.

"మా చిన్నన్నయ్య ఎలా ఉండేవాడెలా అయిపోయాడో! వాణ్ణి చూస్తుంటేనే దుఃఖం పొంగి వచ్చిందనుకో వదినా!"

"అవునమ్మా! మీ పెద్దన్న కంట తడిపెట్టగా నేనేన్నడూ చూడలేదు. ఆయన

సైతం శ్రీధర్‌ను చూడగానే ఎలా అయిపోయారో!"

"విదేశాలు, విదేశాలు అంటూ ఎందుకొచ్చిన మోజు వదినా? చిన్నన్నయ్య కూడా హాయిగా మన మధ్యే ఉంటే పోలే? వాణ్ణి తిరిగి వచ్చేయమని చెప్పాలను కొంటున్నాను. మీరూ చెప్పండి."

భోజనాల దగ్గర గమనించాను వాణ్ణి, ఏదీ సరిగా తినలేకపోయాడు.

"అదేమిటయ్యా శ్రీధర్? అత్తగారు అస్తమానం అంటూ ఉండేవారు - వంకాయ కూర..... దోస ఆవకాయ అంటే నీకు చాలా ఇష్టం అని - అందుకని చేశాను. అసలు వాటిని ముట్టనే ముట్టలేదేం?" అంది జానకి.

"నిజమే వదినా! దొడ్డమ్మ నా కోసం ఎంత ప్రత్యేకంగా చేసేదో వాటిని! కాని ఈ జర్మనీ జీవితం నన్నూ, నా తిండినీ పూర్తిగా మార్చేసింది. ఈ కారాలు, ఆవల అలవాట్లు తప్పిపోయాయి - ఈ కూరలను, ఈ కారాలను చూస్తే ప్రాణం లేచి వచ్చింది - కాని తినే అదృష్టం లేదు.... నాకు జర్మనీలో రెస్టారెంట్ భోజనం అలవాటైంది."

శ్రీధర్ మొహం చిరుచెమటతో కందిపోయింది, కొంచెం దోసావ తినేపాటికి. పెరుగన్నంతో ముగించాడు భోజనాన్ని.

అంతా డాబా మీద పక్కలు పరచుకొని పడుకొన్నాము. మా చిన్ననాటి ఘట్టాలను, సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ ఉండిపోయాం అర్ధరాత్రి వరకు. మా కబుర్లలో మేముండగా జానకి, రుక్మిణి ఎప్పుడు నిద్ర పోయారో నిద్ర పోయారు. మా ప్రసంగం చిన్నగా శ్రీధర్ ప్రస్తుత జీవితం వైపు మళ్ళింది.

"సూపర్ ఎల్లాయిస్ పైన రీసెర్చికి డాక్టరేట్ ఇచ్చారు. జర్మన్ సైన్సు అకాడమీలో ఫెలోషిప్ వచ్చింది. అదే అకాడమీవారి రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ స్కాలర్‌గా మరికొన్ని రీసెర్చి ప్రాజెక్ట్స్ ప్రారంభించాను - స్టేట్స్ నుంచి వచ్చిన - రోనాల్డ్ బెన్‌సన్ సహకారంతో. ఆల్టర్ నేటివ్ టు ఎయిర్ ఫ్యూయల్ అనే విషయం పైన రీసెర్చి ప్రారంభించాను" - చెపుతూ ఆగిపోయాడు శ్రీధర్.

"రీసెర్చి పూర్తి అయిందా?" ప్రశ్నించాను.

"ప్చ్! సంవత్సరం తిరగకముందే.... మధ్యలోనే ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది - దాంతో నాలో ఇంటరెస్టు నశించిపోయింది."

"అలా ఎందుకైంది?"

"అలాగే అయింది" నిట్టూర్చాడు - శ్రీధర్ సమాధానం చాలా వింతగా వినిపించినా, ఆ జవాబు నంటి పెట్టుకొని గూడు కట్టుకున్న నిర్వేదం ధ్వనించింది.

"ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకొంటే నిర్విరామ వేగంతో పరుగెత్తి పరిభ్రమించే ఆ దేశాన్ని, ఆ వాతావరణాన్ని ఎలా భరించానో ఇన్నాళ్ళూ. ఇక భరించ లేకపోయాను. తిరిగి వచ్చేశాను" అన్నాడు.

"అంటే?"

"ఆఁ! వన్స్ ఫర్ ఆల్ వచ్చేశాను."

"మరి! జ్యోతేది?"

మౌనంగా ఉండిపోయాడు. వాడి మౌనం నన్ను భయపెట్టింది. కొద్ది సేపయ్యాక - "జ్యోతి నేను తిరిగి వచ్చేపాటికి జర్మనీలో లేదు. స్టేట్స్‌కు వెళ్ళింది" అన్నాడు.

"ఎప్పుడు?"

"సంవత్సరం అయింది."

"శ్రీధర్! ఏం జీవితంరా ఇది? నీవు జర్మనీలో, నీ భార్య స్టేట్స్‌లో, మీ ఆత్మీయులమైన మేమంతా ఇక్కడ. ఈ సిరి సంపదలు, కీర్తి - వ్యక్తిగతంగా వీటన్నింటి అర్థం, ప్రయోజనం ఏమిటి?" ప్రశ్నించాను.

నాకేసి అలా చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత ఏదో చెప్పబోయి, మళ్ళీ తానే ఆగిపోయాడు. కొన్ని క్షణాల తరువాత - "తనొస్తుంది - త్వరలో" అన్నాడు. వాడిది అతి సున్నితమైన మనస్సు. తరచి తరచి వాణ్ణేమీ ప్రశ్నించ లేకపోయాను.

★ ★ ★

శ్రీధర్ విజయవాడలో పది రోజులున్నాడు - అదీ మేమంతా బలవంతం చేయటాన. ఆ పదిరోజులూ మాతో కంటే, నానీ తోటే ఎక్కువ కాలం గడిపాడు.

నానీ లయొలాలో ఇంటర్ సీనియర్. వాడికి చిన్నప్పటి నుంచి తానూ, బాబాయ్‌లా గొప్ప ఇంజనీరు కావాలని ఆకాంక్ష. శ్రీధర్ రావటంతో వాడి ఆకాంక్ష పురులు విప్పింది. శ్రీధర్ వాడికో హీరో. శ్రీధర్‌కు కూడా నానీ పట్ల ఎనలేని వాత్సల్యం. చదువును ఎలా ప్లాన్ చేసుకోవలసిందీ - ఏయే పుస్తకాలను సెలవుల్లో రిఫర్ చేసికోవలసిందీ - ఇలా ఎన్నో మార్గదర్శక సూత్రాలను వాడికి చెప్పటంలో నిమగ్నమై పోయేవాడు.

నానీ కూడా "బాబాయ్ బాబాయ్" అంటూ వాణ్ణి అతుక్కుపోయాడు.

"మన నానీ గొప్ప జీనియస్ వదినా!" అన్నాట్ట శ్రీధర్ జానకితో.

"ఏమో! నీ పోలిక వచ్చి అంత గొప్పవాడవుతాడేమో!" అందిట జానకి.

పది రోజుల తరువాత మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ వారితో అపాయింట్ మెంట్ తీసుకొని ఢిల్లీ వెళ్ళాడు శ్రీధర్. పని చూసుకొని తిరిగి విజయవాడ వస్తాడను కొన్నాను. కానీ ఢిల్లీ హోటలు నుంచి జాబు రాశాడు.

"అన్నయ్యా!

"మీ సమక్షంలో విజయవాడలో ఉన్న పది రోజులూ - మీకూ, రుక్మిణికీ నా గురించి కొన్ని నిజాలూ చెప్పలేక ఎంత గిల్టీగా గడిపానో!

మీతో జ్యోతి స్టేట్స్ నుంచి తిరిగి వస్తుందని చెప్పాను కదూ? వట్టిది. జ్యోతి తిరిగి రాదు! కోటీశ్వరుడు..... నా రీసెర్చి మేట్.... రోనాల్డ్ బెన్‌సన్‌తో స్టేట్స్‌కు వెళ్ళి పోయిందామె. చివరి క్షణం వరకు జ్యోతిని ఆపి దక్కించుకోవాలనే ప్రయత్నించాను. కాని ఆమె ఓ పెను తుపాను గాలి వాటుకు కొట్టుకొని పోతున్న దానిలా వెళ్ళి పోయింది.

"నాలోని ఉత్సాహం, దీక్ష, ప్రశాంతత, ఆశలు, ఆశయాలు, విశ్వాసం ఆ తుపానుకు గురై కూలిన విమానపు శకలాల్లా చిందరవందర య్యాయి.

"జ్యోతి వెళ్లాక ఆమె వదిలి వెళ్ళిన డైరీలు కనిపించాయి. నాకు తెలియ కుండానే మీ పట్ల నే నెంతటి దోషినో చెప్పాయా డైరీలు. జీవితాంతం నీ పక్కన నడిపించుకోవాలనుకొన్న జ్యోతిని లాక్కున్నాను నేను! నాకు సరైన శిక్ష విధించాడు

భగవంతుడనిపిస్తోంది. 'క్షమించ'మని అడగటానికి వచ్చాను - కాని మీ ముందు మాట్లాడగల స్థైర్యం కూడా లేకుండా పోయింది.

"నిన్ననే డిఫెన్స్‌లో సీనియర్ సైంటిస్టుగా చేరమని డిఫెన్సు అడ్వైజరు ఆహ్వానించారు. చేరదామనే అనుకున్నాను. కానీ ఈ మానసిక స్థితిలో నేను ఈ దేశానికేం చేయగలను?

"ప్రశాంతతను వెతుక్కొంటూ ఏ ఆశ్రమానికో వెళ్ళాలని ఉంది.

"మీరు నన్ను క్షమించానంటే - నా మనస్సు కుదుటపడుతుంది. ఆపై నే నెటైనా వెళ్ళగలను.

మీ,

శ్రీధర్."

ఆ జాబు చూసి నిర్విణ్ణుడిని అయ్యాను.

రుక్మిణి అయితే వెక్కి వెక్కి ఏడ్చింది.

జానకికి తెలుసు నా పట్ల జ్యోతి గతం:

"అయ్యో పాపం, శ్రీధర్!" అని ఆందోళన పడింది జానకి.

కర్తవ్య విమూఢునిలా ఉన్న నా దగ్గరకు నానీ వచ్చి -

"నాన్నగారూ! నేను ఢిల్లీ వెళ్ళి బాబాయిని తీసుకు వస్తాను" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాను నానీ కేసి. వాడిలో శ్రీధర్‌ను తీసుకురాగలననే విశ్వాసం కనిపించింది.

"శ్రీధర్!

నిన్ను నేను క్షమించవలసిందేమిటో నా కర్థం కావటం లేదు.మనం సాను భూతితో క్షమించగలగాల్సింది జ్యోతిని. పాపం, జ్యోతి మన సాక తెగిన పతంగం.

మరో విషయం. మనం దేని నుంచీ పారిపోకూడదు.

రూపు దిద్దుకొంటున్న మరో తరం ప్రతినిధి నానీ. వాడు నిన్నే ఆదర్శమూర్తిగా, మార్గదర్శిగా భావిస్తున్నాడు. వాడికి జీవితం నుంచి పారిపోవడం నేర్పుతావా?

నిన్ను తెచ్చుకోవాలనీ కొండంత ఆశతో వస్తున్నాడు వాడు.

నానీతో తిరిగి వస్తున్నావు కదూ! రుక్మిణీ, జానకీ, నేనూ వేయి కళ్ళతో నీ కోసం ఎదురు చూస్తున్నాం.

మీ అన్నయ్య
భాస్కరం"

అన్న నా జాబుతో నానీ శ్రీధర్ కోసం రైలెక్కాడు. ●

## కథ వెనుక కథ :

*నా సహోద్యోగి మిత్రుడు శ్రీ మనోరంజన్, జర్మనీ నుండి తిరిగి వచ్చిన తన బంధువొకరిని పరిచయం చేసాడు, జర్మనీలో ఇంజనీరంటూ. ఆ మరునాడు ఆఫీసులో చెప్పాడు ఆ ఇంజనీరు భార్య తన మేనత్త కూతురేనని - మొదట ఆ అమ్మాయికి తనకూ వివాహం అనుకొనేవారని. వాడు ఇంజనీరు అవటంతో - ఆవిడ అటు మొగ్గిందట.*

*'Any disappointment?' ప్రశ్నించాను. 'అబ్బే! అలాంటిదేం లేదు' - అన్నాడు. మరో పదిహేను రోజుల తర్వాత మనోరంజనే చెప్పాడు. ఆ ఇంజనీరు భార్య అతనితో ఇండియా రాలేదట. ఏదో ఎసైన్‌మెంటులో వుందని స్టేట్స్‌కి వెళ్ళిందని, పిల్లల చదువులని, ఏవేవో చెపుతున్నాడట ఇంజనీరు. బధువు లెవ్వరూ నమ్మటం లేదు."*

*ఈ కథ వ్రాసి చదివి వినిపించగా, 'అవును దాని మనసు తెగిన పతంగమే-" అన్నాడు మనోరంజన్.*

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 20-12-1989)* ★

